నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్
5 | నిజామాబాద్, గురువారం 14 మార్చి 2024 | ADILABAD


## ఫలించిన రైతుల దీక్ష

జైనథ్, మార్చి 13 : బైపాస్ రోడ్డును రద్దు చేయాలని 56 రోజుల నుంచి రైతులు నిరాహార దీక్ష చేస్తున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జాతీయ రహదారి జిల్లా డీఈ రైతుల దీక్షా శిబిరానికి వచ్చి బైపాస్ రోడ్డును రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో బేల, శంషాబాద్ మాజీ సర్పంచ్‌లు దీక్షలో కూర్చున్న రైతులకు నిమ్మరసం ఇచ్చి విరమింప చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. అధికారులు స్పందించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.


నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప చేయిస్తున్న మాజీ సర్పంచ్‌లు

## హాజరు శాతం పెంచాలి..

### అడిషనల్ పీడీ కుటుంబరావ్


కోటా(కే)లో పనులను పరిశీలిస్తున్న అడిషనల్ పీడీ కుటుంబ రావ్

బోథ్, మార్చి 13 : ఉపాధి హామీ పనుల్లో కూలీల హాజరు శాతం పెంచాలని డీఆర్‌డీవో అడిషనల్ పీడీ కుటుంబరావ్ సూచించారు. బుధవారం కౌఠ(బీ), పొచ్చెర, సాకెర, కోటా(కే) గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించారు. అనంతరం ఉపాధి పనులను క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాబ్ కార్డులున్న వారందరు పనులకు వచ్చేలా సిబ్బంది ప్రోత్సహించాలని సూచించారు. గ్రామస్థాయిలో పనులపై అవగాహన కల్పించాలన్నారు. హాజరు శాతం, పనులను ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలన్నారు. ఆయన వెంట ఏపీవో జగ్దేరావు, టెక్నికల్ అసిస్టెంట్లు మధు, శ్యాం, నరేశ్ ఉన్నారు.


మహారాష్ట్రలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఇరు రాష్ట్రాల అధికారులు

## పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అలర్ట్

### మహారాష్ట-తెలంగాణ సరిహద్దు జిల్లాల పోలీసులతో నాగపూర్ ఐజీ సమావేశం

ఎదులాపురం, మార్చి 13 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మహారాష్ట్ర, తెలంగాణ పోలీసులు అలర్ట్ అయ్యారు. ఇరు రాష్ట్రాల సరిహద్దు జిల్లాల అధికారులతో నాగపూర్ ఐజీ చెర్రింగ్ డోర్జె ప్రత్యేకంగా సమావేశమయ్యారు. చంద్రపూర్ జిల్లా ఎస్పీ ఎం సుదర్శన్, కుమ్రం భీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్ ఎస్పీలు సురేశ్ కుమార్, గౌష్ ఆలం, ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షా షా, చంద్రాపూర్ కలెక్టర్ వినయ్ గోద్వ, యావత్మల్ ఎస్పీ పవన్ ధన్‌సూద్, ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ వేణు ఈ సమావేశానికి హాజరయ్యారు. మహారాష్ట్రలోని చంద్రపూర్ ఎస్పీ కార్యాలయంలో ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగపూర్ ఐజీ మాట్లాడుతూ.. ఇరు రాష్ట్రాల సరిహద్దు జిల్లాల అధికారులు నమన్వయంతో పనిచేసి ఎన్నికలు సజావుగా సాగేలా కృషి చేయాలన్నారు. సరిహద్దుల వద్ద భద్రతా చర్యలు పటిష్టంగా ఏర్పాటు చేయాలని సూచించారు. నేరాల కట్టడి, కేసుల విషయంలో ఒకరికొకరు సహకరించుకోవాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై ఇరు రాష్ట్రాల అధికారులు చర్చించారు. చెక్‌పోస్టుల ఏర్పాటు, బందోబస్తు, పార్లమెంట్ ఎన్నికలు సజావుగా పూర్తయ్యేలా తీసుకోవాల్సిన ఏర్పాట్లపై సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు.


గుండాలలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

## ఉపాధి ఉద్యోగుల వేతన వెతలు

● మూడు నెలలుగా అందని జీతాలు ● కుటుంబ పోషణ భారమవుతున్నదని ఆవేదన

నార్నూర్, మార్చి 13 : గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు పనులు కల్పించి, వలసల నివారణకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉపయోగపడుతున్నది. ఇందులో పనిచేసే ఉద్యోగులు, సిబ్బందికి మాత్రం మూడు నెలలుగా వేతనాలు రావడం లేదు. కూలీలకు ఉపాధి కల్పిస్తూ, వారికి సకాలంలో డబ్బులు అందిస్తున్నా తమకు వేతనాలు రాక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా ఉమ్మడి మండలంలో క్షేత్ర సహాయకులు, సాంకేతిక నిపుణులు, ఏపీవో, కంప్యూటర్ ఆపరేటర్లు విధులు నిర్వహిస్తున్నారు. కేసీఆర్ సర్కారు హయాంలో తమ బ్యాంకు ఖాతాల్లో ఠంఛన్‌గా జీతాలు జమ అయ్యేవి. అయితే డిసెంబర్ నుంచి ఇద్దరు ఏపీవోలు, 15 మంది టెక్నికల్, 22 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, నలుగురు కంప్యూటర్ ఆపరేటర్లు, అటెండర్లకు జీతాలు రావడం లేదు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే వేతనాలు చెల్లించాలని కోరుతున్నారు.

### విన్నవించాం..

**- రాథోడ్ సురేందర్, ఏపీవో, నార్నూర్.**

ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల వేతనాలు నిలిచిపోయిన మాట వాస్తవమే. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే వేతనాలు జమవుతాయని అధికారులు చెబుతున్నారు.

## వినియోగదారుల సమస్యలను పరిష్కరిస్తాం..

తాంసి, మార్చి 13 : విద్యుత్ వినియోగదారుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ రామకృష్ణ స్పష్టం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులకు సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ రామకృష్ణ మాట్లాడుతూ.. పరిష్కార వేదికలో 64 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. అందిన ఫిర్యాదుల్లో 80 శాతానికి పైగా గతంలో వేసిన విద్యుత్ స్తంభానికి, మరో విద్యుత్ స్తంభం మధ్య చెలలో కిందికి తీగలు వేలాడుతున్నాయనే విషయంపై ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. వీటిని త్వరలోనే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీజీఆర్‌ఎఫ్ ఫైనాన్స్ మెంబర్ కిషన్, ఫోర్త్ మెంబర్ రాజాగౌడ్, ఎస్ఈజేఆర్ చవాన్, డీఈలు హరికృష్ణ, ఈదన్న, ఏడీఈ దేవాగౌడ్, ఏఈ మనోజ్ కుమార్ పాల్గొన్నారు.


అర్జీలను స్వీకరిస్తున్న సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ రామకృష్ణ

## ఆకట్టుకున్న మాక్ పోలింగ్

ఆదిలాబాద్ రూరల్, మార్చి 13 : చట్టసభల్లో ప్రజాప్రతినిధుల పాత్ర గురించి తెలిపేలా విద్యార్థులు నిర్వహించిన మాక్ పార్లమెంట్ ఆకట్టుకున్నది. బుధవారం ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, శిక్షణ కలెక్టర్ వికాస్ మహతో ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ఎంపీలుగా ఎన్నికైన వారు పార్లమెంట్‌లో సమస్యలు ఎలా ప్రస్తావిస్తారో, అధికార, ప్రతిపక్ష సభ్యుల వాదోపవాదాలు, మంత్రుల వివరణలు, స్పీకర్ సభను నడిపించే తీరును వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన శాఖ అధికారి వెంకటేశ్వర్లు, నెహ్రూ యువ కేంద్రం అధికారి సుశీల్, ప్రిన్సిపాల్ అనిత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి







క్లిక్..క్లిక్..

## మా దేవుడు మీరే..



నా పేరు ఆశన్న. మాది కప్పర్ల గ్రామం. నేను వ్యవసాయం చేస్తా. నాకు నాలుగెకరాల భూమి ఉంది. ఇందులో శనగ వేశా. మా చేను ఈ దారిలోనే ఉంటది. రోజు నాలుగు సార్లు నడుచుకుంటూ వచ్చి పోతుంటా. ఒక్కోసారి రాత్రి కూడా వెళ్తా. రోడ్డు కంకర తేలి, గుంతల మయంగా ఉండడంతో చాలా ఇబ్బంది అవుతున్నది. కంకరపై నడుచుకుంటూ వస్తుండడంతో రాళ్లు గుచ్చుకుపోయి రక్తం కారిన రోజులు ఉన్నయ్. రాత్రి వేళ గుంతల్లో పడిన సందర్భాలు అనేకం. కలెక్టర్ గారు మీరే మా ఆశ. మీరు దృష్టి పెట్టి దేవుడిలా రోడ్డును బాగు చేయించండి.

# కలెక్టర్ గారూ.. ఈ రూట్‌లో రావొద్దు..

### రహదారి కంకర తేలి, గుంతలు పడి అధ్వానంగా ఉంది..

● రాత్రివేళ అదుపుతప్పి పడిపోతున్నాం.. తీవ్రగాయాలవుతున్నాయి..
● నడుం నొప్పులు, డిస్క్ సమస్యలు, ఒళ్లు హూనం అవుతున్నది..
● రోడ్డు బాగు చేయించండని 30 గ్రామాలవాసుల వేడుకోలు
● నేడు కప్పర్ల గ్రామంలో కలెక్టర్ రాజర్షి షా పర్యటన




**'ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలో** గల బండల్‌నాగపూర్ నుంచి కప్పర్ల వెళ్లే రహదారి సుమారు ఐదు కిలో మీటర్ల(పొచ్చర బ్రిడ్జి నుంచి కప్పర్ల గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి) వరకు రోడ్లు అస్తవ్యస్తంగా ఉంది. ఈ రోడ్డును 16 ఏండ్ల క్రితం నిర్మించగా.. ప్రస్తుతం కంకర తేలి, గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. ఈ రహదారి మీదుగా భీంపూర్ మండలంలోని దాదాపు 20 గ్రామాలు, తాంసి మండలంలోని 10 గ్రామాలకు చెందిన దాదాపు 12 వేలకుపైగా ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇందులో కూలీలు, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, దుకాణాల్లో పనిచేసుకునే వారు వివిధ పనుల నిమిత్తం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వస్తూపోతుంటారు. బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో ఉదయం వెళ్లి రాత్రి వస్తుంటారు. రాత్రి వేళల్లో రహదారి చీకటి మయంగా ఉండి ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. ఈ రహదారి బాగులేకపోవడం వల్ల 12 కిలోమీటర్లు అధికంగా ప్రయాణించాల్సి వస్తున్నది. సమయంతోపాటు డబ్బులు కూడా వృథా అవుతున్నాయి. రోడ్డును నిర్మించాలని ఆందోళనలు చేసినా, విజ్ఞప్తులు ఇచ్చినా ఫలితం లేదు. కలెక్టర్ రాజర్షి షా గారూ గురువారం కప్పర్లలో గ్రంథాలయం ప్రారంభించడానికి వస్తున్నారని తెలిసింది. ఈ రోడ్డు బాగా లేదు. ఏదైనా ప్రమాదం జరిగితే మా ఊళ్లకు చెడ్డ పేరు వస్తుంది. అందుకే ఈ రోడ్డు గుండా రావొద్దని వేడుకుంటున్నాం. అదే సమయంలో మా బాధలు అర్థం చేసుకుని రోడ్డును బాగు చేయాలని కోరుతున్నాం. ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటేనే సాధ్యమవుతుందని వివిధ గ్రామాల ప్రజలు విన్నవించుకుంటున్నారు. **- తాంసి, మార్చి 13**




## కలెక్టరేట్ ఎదుట ధర్నా

నోటికి నల్లగుడ్డలు కట్టుకుని నిరసన తెలుపుతున్న కుమ్రం భీం కాలనీవాసులు

కుమ్రం భీం కాలనీలో నివసిస్తున్న ఆదివాసులకు ఇంటి స్థలాలకు పట్టాలు, నీళ్లు, కరెంటు, విద్య, వైద్యం, రోడ్డు సౌకర్యం కల్పించాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ ఎదుట నోటికి నల్లగుడ్డలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. వారికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కుమ్రం భీం కాలనీవాసులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవికు వినతిపత్రం అందజేశారు. **- ఎదులాపురం, మార్చి 13**

## కళలను కాపాడుకుందాం..

### స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ టౌన్, మార్చి 13 : దేశంలో అంతరించిపోతున్న కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. బుధవారం నిర్మల్ కలెక్టర్ కార్యాలయంలో ఇన్నోవేషన్ యాత్రికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మల్ కొయ్య బొమ్మలు పేయింటింగ్‌కి ప్రపంచంలో మంచి గుర్తింపు ఉందని తెలిపారు. వీటిపై మరింత ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ కళలను ప్రోత్సహించేందుకు నూతన ఆవిష్కరణలు చేయాలని కోరారు. వ్యవసాయం సేంద్రియ సాగు విధానంపై ఆసక్తి కలిగేలా చూడాలని విన్నవించారు. ఈ నెల 12 నుండి 16 వరకు యాత్ర నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల అధికారి నర్సింహారెడ్డి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రయోగాలు విద్యార్థులకు ప్రయోజనం

నిర్మల్ అర్బన్, మార్చి 13 : ప్రయోగాలు విద్యార్థులకు ప్రయోజనం చేకూరుస్తాయని డీఈవో రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సోమవార్‌పేట్ పాఠశాలలో అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో జీవశాస్త్ర ఉపాధ్యాయులకు ప్రయోగశాల కృత్యాలపై మెలకువలను నేర్పించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. విద్యార్థులకు వైజ్ఞానిక ధృక్పదం పెంపొందించడానికి ప్రయోగాలు తప్పనిసరి అని అన్నారు.



వీసీలో మాట్లాడుతున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ

## 'ఆత్మనిర్భర్'తో మేలు

### ప్రధానమంత్రి నరేంద్రమోదీ

నిర్మల్ టౌన్, మార్చి 13 : ఆత్మనిర్భర్‌తో యువ ఆవిష్కరణలు వెలుగులోకి వచ్చాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఢిల్లీ నుంచి బుధవారం పీఎం సురాజ్ జాతీయ పోర్టల్‌ను ఆవిష్కరించి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా అధికారులు రాజేశ్వర్, చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ రాజుతోపాటు కులవృత్తుల వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని దేశంలో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడ్డ కుటుంబాలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. మహిళలకు ఉచిత గ్యాస్ అందిస్తున్నామన్నారు.

## 'కుష్టు' సర్వే పరిశీలన

ఎదులాపురం, మార్చి 13 : కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు ఉద్యమంలో భాగంగా ఈ నెల 11 నుంచి నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను ఆదిలాబాద్ జిల్లా కుష్టు నివారణ అధికారి గజానన్ పరిశీలించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని భుక్తాపూర్, వడ్డెర కాలనీ, రణదివేనగర్‌తోపాటు తాంసి మండలంలోని పొన్నారిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుమానితులను గుర్తిస్తే సంబంధిత వైద్యాధికారి వద్దకు పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ పారా మెడికల్ అధికారి వామన్‌రావు, ఎల్టీ రమణాచారి, యూపీహెచ్‌సీ సీవోలు రణిత, ప్రశాంత్‌దేశ్‌పాండే, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


డోర్‌పై రాసిన నంబర్‌ను పరిశీలిస్తున్న జిల్లా కుష్టు నివారణ అధికారి గజానన్


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మందకృష్ణ మాదిగ

## నిందితుడిని కఠినంగా శిక్షించాలి..

ఖానాపూర్ టౌన్, మార్చి 13 : ప్రేమ పేరిట వేధింపులకు గురిచేసి ఖానాపూర్ పట్టణానికి చెందిన అలేఖ్యను హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం అలేఖ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ.. నిందితుడి తరపున వాదించడానికి లాయర్లు ముందుకు రావద్దని విజ్ఞప్తి చేశారు. న్యాయ వ్యవస్థ వీలైనంత త్వరగా నిందితుడిని శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్ జాతీయ కార్యదర్శి బిక్కి మురళీకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ సంతోష్ పాల్గొన్నారు.